
గజవాహనంపై స్వామికి అడవివరంలో తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు


ఉత్సవానికి ప్రతీకగా పూలతోటలో ఏర్పాటుచేసిన ఏనుగు, మొసలి బొమ్మలు


వరదరాజస్వామి అలంకరణలో దర్శనమిచ్చిన అప్పన్న

కనులపండువగా మకరవేట

- వరదరాజస్వామిగా సింహాద్రి అప్పన్న
- విశేషంగా గ్రామ తిరువీధి
- పరవశించిన భక్తజనం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మకర వేట(గజేంద్రమోక్షం) ఉత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. కొండదిగువ పూలతోటలో ఈ ఉత్సవాన్ని సింహాచలం దేవస్థానం వైదికులు ఘనంగా నిర్వహించారు. వరాహ లక్ష్మీనృసింహస్వామి వరదరాజస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామిని కనులారా తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. రెండు చేతులు జోడించి స్వామికి జేజేలు పలికారు. స్వామి వారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని వరదరాజస్వామిగా అలంకరణ చేసి సాయంత్రం సింహగిరి నుంచి మెట్ల మార్గం ద్వారా కొండదిగువకు తీసుకొచ్చారు. తొలి పావంచా వద్దకు చేరుకున్న స్వామికి అడవివరం గ్రామస్తులు, దేవస్థానం అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి స్వామిని ఆయన సోదరి అయిన అడవివరం గ్రామదేవత పైడి తల్లి అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ స్వామికి మహిళలు మంగళహారతులిచ్చారు. అక్కడి నుంచి స్వామిని పూలతోటకి తీసుకెళ్లి ప్రధాన మండపంలో అధిష్ఠంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడషోపచార పూజలు నిర్వహించారు. అనంతరం భాగవత పురాణ విన్నపం, గజేంద్ర మోక్షం ఘట్ట విన్నపం చేశారు. తదుపరి స్వామిని అక్కడి నుంచి పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి గజవాహనంపై అధిష్టించారు. రాత్రి గ్రామ తిరువీధి విశేషంగా చేశారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన స్వామికి గ్రామస్తులు విశేషంగా హారతులిచ్చారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, పవ్కుమారాచార్యులు, చిన్నా తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్‌రాజ్, ప్రత్యేక ఆహ్వానితుడు చందుయాదవ్ తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఈవో త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. పూలతోటను పెద్ద ఎత్తున విద్యుద్దీపాలతో అలంకరించారు. గోపాలపట్నం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని పూలతోటలోని కొలను వద్ద మూడుసార్లు వెలిగించిన జువ్వలు మూడు వెళ్లి తిరిగి రావడంతో ఈఏడాది వరి, అపరాలు, మెట్ట పంటలు బాగా పండుతాయని విశ్వసించారు.


కొండపై నుంచి పూలతోటలోకి స్వామిని తిరువీధిగా తీసుకొస్తున్న అర్చకులు,ట్రస్ట్‌బోర్డు సభ్యులు

క్లుప్తంగా

పొంచిఉన్న ముప్పు


కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

పరవాడ: తిక్కవానిపాలెం–వాడచీపురుపల్లి రహదారిలో కాన్వెంట్ సమీపంలో విద్యుత్ స్తంభం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉంది. దీంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. గతంలో వచ్చిన తుపానులో సమయంలో రహదారి వెంబడి ఏర్పాటు చేసిన స్తంభం ఓ పక్క ఒరిగి పోయింది. అయినా విద్యుత్ శాఖ అధికారులు కనీస చర్యలు చేపట్టలేదు. ఫలితంగా స్తంభం ఏ క్షణంలో కూలుతుందోనని రహదారిలో రాకపోకలు సాగిస్తున్న తిక్కవానిపాలెం, ఊటగెడ్డపాలెం, ఎస్సీ కాలనీ ప్రజలతో పాటు తిక్కవానిపాలెం బీచ్‌ను సందర్శించే పర్యాటకులు బితుకు బితుకు మంటూ రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి నేలకొరిగిన స్తంభాన్ని సరిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ వలంటీర్లకు ఆహ్వానం

మర్రిపాలెం: ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పని చేసేందుకు వలంటీర్లు కావాలని ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. ఆసక్తి గల యువకులు, వ్యాపారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, సంఘసేవకులకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలియజేశారు. ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు, ట్రాఫిక్ పోలీసులకు సహకరించేందుకు, ట్రాఫిక్ రూల్స్ ప్రచారం చేసేందుకు, కౌన్సెలింగ్ చేసేందుకు ఆసక్తిగలవారు సంప్రదించాలని సూచించారు. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో కంచరపాలెం, ధర్మానగర్, దుర్గానగర్, జ్ఞానాపురం, ఊర్వశి, కప్పరాడ, మాధవధార, మురళీనగర్, ఐటీఐ జంక్షన్, మర్రిపాలెం, 104 ఏరియా, కరాస, బర్మానగర్, ఎన్ఏడీ, బుచ్చిరాజుపాలెం, విమాన్ నగర్, కాకానినగర్, ఎన్ఎస్‌టీఎల్ ప్రాంతాల్లో నివసిస్తున్న ఉత్సాహవంతులైన వారు ముందుకు రావచ్చన్నారు. ట్రాఫిక్ పోలీసుతో కలిసి వలంటీర్‌గా పని చేయాలనుకునే వారు నేరుగా కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో లేదా ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావును 9440796037 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

లలితా దీక్షలు ప్రారంభం


స్వామీజీ చేతుల మీదుగా దీక్ష తీసుకుంటున్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితాపీఠంలో లలితా దీక్షలు సంక్రాంతి రోజు ప్రారంభం అయ్యాయి. సంక్రాంతి నుంచి మాఘ పౌర్ణమి వరకు దీక్షధారులు 21 రోజుల పాటు దీక్షలో ఉంటారని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కుర్తాళం నుంచి వచ్చిన పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి శిష్యులు ఆదిత్యానంద భారతి స్వామి చేతుల మీదుగా పలువురు భక్తులు దీక్ష తీసుకున్నారు. ఈ సందర్భంగా లలితాదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

తీరంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం


తీరానికి కొట్టుకువచ్చిన మహిళ మృతదేహం

బీచ్ రోడ్డు: ఆర్కే బీచ్ తీరానికి గుర్తు తెలియని మహిళ మృతదేహం సోమవారం కొట్టుకువచ్చింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 11 గంటలకు కాళీమాత ఆలయం ఎదురుగా తీరంలో ఒక మహిళ మృతదేహాన్ని గుర్తించారు. ఆమె వయస్సు సుమారు 65 ఏళ్లు ఉంటుందని, ఎత్తు 5 అడుగులు, ముదురు ఎరుపు రంగు చీర, నలుపు రంగు జాకట్టు ధరించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచామన్నారు. మహిళను గుర్తించిన వారు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

లక్ష్యవర్మ మృతదేహం లభ్యం

పరవాడ: అచ్యుతాపురం మండలం తంతడి బీచ్‌లో ఈ నెల 13న ఈతకు దిగి గల్లంతైన యువకుడు లక్ష్యవర్మ మృతదేహం తిక్కవానిపాలెం తీరంలో ఆదివారం లభ్యమైందని సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. అనకాపల్లికి చెందిన యువకుడు లీలా ప్రశాంత్, ఢిల్లీకి చెందిన 14 ఏళ్ల యువకుడు లక్ష్యవర్మలు ఈ నెల 13న తంతడి తీరంలో స్నానానికి దిగి ఈత కొడుతున్న క్రమంలో బలమైన కెరటాలకు ఇద్దరూ సముద్రం లోపలికి కొట్టుకుపోయారు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానిక మత్స్యకార యువకులు గల్లంతైన అనకాపల్లి యువకుడు లీలా ప్రశాంత్‌ను కాపాడినా ప్రయోజనం లేకపోయింది. అప్పటికే మృతి చెందాడు. మరో యువకుడి మృతదేహం తిక్కవానిపాలెం తీరానికి ఆదివారం నాటికి చేరింది. దీంతో ఇద్దరి మృతదేహాలకు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి సోమవారం బంధువులకు అప్పగించామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

చురుగ్గా మినీ వంతెన పనులు


సాగుతున్న పెద్ద చెరువు మినీ వంతెన నిర్మాణ పనులు

పరవాడ: స్థానిక పెద్ద చెరువు వద్ద నిర్మిస్తున్న మినీ వంతెన పనులు చకాచకా సాగుతున్నా యి. పెద్ద చెరువు ఆయకట్టు రైతులు పండించి న పంటలు ఇళ్లకు చేర్చుకోవడానికి వీలుగా కళింగ వద్ద మినీ వంతెన నిర్మాణానికి రాంకీ యాజమాన్యం రూ.8 లక్షలు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఆ నిధులతో పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మినీ వంతెన పూర్తయితే తమకు అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇది మురుగు కాలువే!


కాలువలో దట్టంగా పెరిగిన తుప్పలు

పరవాడ: వాడచీపురుపల్లిలో ప్రజలు వినియోగిస్తున్న వాడక నీరు ప్రవహించడానికి ఏర్పాటు చేసిన కాలువ పూడికలతో నిండిపోయింది. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో నేస్తాలమ్మ సతకం పట్టు నుంచి ఏర్పాటు చేసిన సీసీ కాలువ పిచ్చి మొక్కలు గడ్డి పెరగడంతో వాడుక నీరు పారడం లేదు.దీంతో భరించలేని దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో పూడికలు తొలగించాలని కోరుతున్నా సచివాలయ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా కాలువలో పూడికలు తొలగించి మురుగునీరు ప్రవహించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా రాములోరి తీర్థం


వాడచీపురుపల్లి రాములవారి తీర్థంలో పాల్గొన్న ప్రజలు

పరవాడ: వాడచీపురుపల్లి, పరవాడ గ్రామాల్లో కొలువు దీరిన సీతారాముల తీర్థ మహోత్సవాలను సోమవారం ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించారు. రామాలయాల్లో ఉదయం నుంచి భక్తులు సీతారాములకు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఆలయాల వద్ద నిర్వహించిన పరసల్లో తోడపెద్దు గరిడీలు, తప్పెటగుళ్లు, చిడతలు, భజనలు, కోలాటాలు, బాణ సంచాకాల్పులు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తీర్థాల్లో పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి తీర్థం

సబ్బవరం: సబ్బవరం శివారు పెదనాయుడుపాలెంలో కొలువైన వేణుగోపాలస్వామి తీర్థమహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. స్వామి వారిని అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తితో పాటు పలువురు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఏటా సబ్బవరపు వారి కుటుంబాలు చేతులమీదుగా పండగ చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

ఆధ్యాత్మికం

నమో శివరుద్రాయ


ఉమాచంద్రమౌళేశ్వరస్వామి

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. భక్తులు హరనామస్మరణలో మునిగితేలారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం


మృతుడు వెంకట రమణ (ఫైల్ ఫొటో)


ప్రమాదంలో దుర్మరణం చెందిన వెంకట రమణ

అక్కిరెడ్డిపాలెం: సైకిల్‌పై రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఘటనకు సంబంధించి గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక బీసీ రోడ్డు భానోజీ కాలనీ, సీతారాంనగర్‌కు చెందిన గంట వెంకట రమణ (58) ఆటోనగర్‌లోని ఒక కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం ఉదయం విధులు ముగించుకుని, ఇంటికి వెళ్లే క్రమంలో సైకిల్‌పై ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఇదే సమయంలో విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద వెంకట రమణను ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకట రమణ తలకు తీవ్ర గాయమై, అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అప్పన్న గోశాలలో ఘనంగా గోపూజలు


గోవులకు పూజ చేస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు,భక్తులు

సింహాచలం: కనుమ పండగ పురస్కరించుకుని శ్రీకృష్ణాపురంలోని గోశాలలో సోమవారం గోపూజలు విశేషంగా జరిగాయి. గోశాలలోని ఆవులకు భక్తులు పసుపుకుంకుమలు సమర్పించారు. గోశాల ప్రాంగణంలోని శ్రీకృష్ణుడి విగ్రహం చెంత విశేషంగా పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణాష్టకం పఠించారు. విశేషంగా హారతులు అందజేశారు. దేవస్థానం వేద పండితుడు కాళ్లకూరి సుబ్రహ్మణ్యేశ్వరశర్మ పూజలను నిర్వహించారు. ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, శ్రీదేవివర్మ, దినేష్‌రాజ్, ప్రత్యేక ఆహ్వానితుడు చందు యాదవ్ పూజల్లో పాల్గొన్నారు. సూపరింటెండెంట్ గొడవర్తి ప్రసాద్, సిబ్బంది సూర్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ


చినయాతపాలెంలో ..

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు చినయాతపాలెంలో కనుమ పండగ పురస్కరించుకుని గోపూజ సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్,జిల్లా ధార్మిక ప్రచార మండలి ఆధ్వర్యంలో గోపూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గోపూజ,హరిదాసు వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ శరగడం దుర్గినాయుడు, మళ్ల బాలాజీ,మళ్ల నాగభూషణం,వరగడం సత్యనారాయణ,మళ్ల గంగునాయుడు,గ్రామ పెద్దలు మళ్ల కోటేశ్వరరావు, బొడ్డేటి కాశీ సూరి అప్పారావు పాల్గొన్నారు.

సుదీర్ఘ పోరాటం చేస్తున్న ఘనత ఉక్కు కార్మికులదే..


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఒక పరిశ్రమ పరిరక్షణ కోసం సుదీర్ఘ పోరాటం చేసిన ఘనత విశాఖ ఉక్కు కార్మికులకే దక్కుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఇంతకు ముందు దేశంలో ఎక్కడా ఇలా జరగలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన ఉక్కు రిలే దీక్షల్లో 704వ రోజు, సోమవారం దీక్షలో కార్మికులతో పాటు 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, ముస్లిం సోదరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎన్.రామారావు, కె.ఎస్.ఎన్.రామారావు, ఎస్.రామచంద్రరావు, జె.రామకృష్ణ, వై.మస్తానప్ప తదితరులు ప్రసంగించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సుమారు రెండు సంవత్సరాలుగా కార్మికులు పోరాటం కొనసాగిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని, కార్మికులంతా ఏకమై ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. ప్లాంట్‌లో విభాగాలను పునఃప్రారంభించి ఉత్పత్తిని పెంచాలన్నారు. ఈ నెల 30న జరప తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఇతర కార్మికులు పాల్గొన్నారు.

శిల్పారామంలో జోష్


కూచిపూడి నృత్య విన్యాసం

పీఎం పాలెం: సంక్రాంతి పండగ ఉత్సవాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆది, సోమవారాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకుల్లో జోష్ నింపాయి. సోమవారం జ్యోష్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కూచిపూడి, జానపద నృత్యాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. భోగి మంటలు సంక్రాంతి కాంతులు అనే నృత్య రూపకంతో కార్యక్రమం ప్రారంభం అయింది. హేమంత మంచులో సూర్యుడు.. రంగుల పుటిల్లు తెలుగు లోగిళ్లు.. నింగిలో హరివిల్లు నృత్యరూపకాలు అద్భుతంగా ప్రదర్శించి కళాకారులు ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. అరకు థింసా నృత్యం హైలెట్‌గా నిలిచింది. వదినకు ఒకసారి.. నోము నోమున్నాలో.. తదితర జానపద గేయాలకు కళాకారులు హుషారుగా నృత్యం చేసి అలరించారు.

కోటనరవలో విద్యార్థిని ఆత్మహత్య


మృతి చెందిన స్వాతి

సింహాచలం: విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం పెందుర్తి మండలం కోటనరవలో చోటుచేసుకుంది. మృతురాలి తల్లి భూలక్ష్మి తెలిపిన వివరాలు ప్రకారం... కోటనరవలో తల్లి భూలక్ష్మి, అమ్మమ్మతో కలిసి సిరలపు స్వాతి(17) ఉంటోంది. నరవలో చదువుతోంది. మరో వైపు యూట్యూబ్‌లో పలు ప్రోగ్రామ్స్ చేస్తుంటుంది. ఆదివారం రాత్రి ఇంట్లో భూలక్ష్మి బెడ్‌రూమ్‌లో పడుకుని ఉండగా హాల్‌లో స్వాతి యూట్యూబ్ చాటింగ్ చేసుకుంటోంది. సోమవారం తెల్లవారుజాము సమయంలో తల్లి నిద్రించిన గదికి బయట గడియపెట్టి హాల్‌లో ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం 8 గంటల సమయంలో భూలక్ష్మి నిద్రలేచి బెడ్‌రూమ్‌లో నుంచి బయటకి వచ్చేందుకు తలుపు తీసేందుకు ప్రయత్నించగా రాకపోవడంతో కిటికీలో నుంచి కేకలు వేసింది. వెంటనే ఇరుగుపొరుగు వారు వచ్చి ఇంటి ప్రధాన ద్వారం గ్రిల్స్ తాళం విరగ్గొట్టారు. లోపలకి ప్రవేశించి బెడ్‌రూమ్ గది గడియ తీశారు. వెంటనే పెందుర్తి పోలీసులకు భూలక్ష్మి ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలానికి చేరుకున్న పెందుర్తి పోలీసులు పరిశీలన జరిపి మృతదేహాన్ని కేజీహెచ్‌కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలావుండగా కోటనరవలోనే ఉంటున్న నవీన్ అనే యువకుడుతో స్వాతికి పరిచయం ఉందని, దాంతో తాను స్వాతిని మందలించగా అతనితో మాట్లాడటం మానేసిందని, కానీ పదేపదే స్వాతిని నవీన్ వేధిస్తుండటంతోనే ఆమె మృతిచెందిందని మృతురాలు తల్లి భూలక్ష్మి ఆరోపిస్తున్నారు.

ఘనంగా అనంతుని గిరి ప్రదక్షిణ


పూలతోటలోకి విహారానికి వెళ్లి వస్తున్న అనంతుని ఉత్సవ విగ్రహాలు

పద్మనాభం: కనుమ పండగలో భాగంగా పద్మనాభంలో అనంతుని గిరి ప్రదక్షిణ ఉత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నాలుగు గంటలకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. నిత్యారాధన, హోమం, బలిహరణ వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గిరి ప్రదక్షిణ ఉత్సవం ప్రారంభమైంది. కుంతీ మాధవ స్వామి ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను పల్లకిలో పద్మనాభం, ఇసకలపాలెం, అర్చకునిపాలెం గ్రామాల మీదుగా అనంతుని గిరి చుట్టు తిప్పారు. అడుగడుగున స్వామి భక్తుల పూజలందుకున్నారు. దీనిలో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలు ఇసకలపాలెం పొలాల్లో ఉన్న పూలతోటలోకి వెళ్లి కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఇక్కడ పంటలు ఎలా పండాయని అయ్య వారు, అమ్మ వార్ల తరపు మాట్లాడుకునే సన్నివేశం ఆసక్తిగా నిలిచింది. పద్మనాభం జిల్లా పరిషత్ బంగ్లా సమీపంలో ఉయ్యాల మండపం వద్ద శ్రీదేవి, భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలకు ఉయ్యాల ఉత్సవం నిర్వహించారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

పీఎం పాలెం: పీఎం పాలెం పోలీసులు నిషేధిత గంజాయి అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 4.8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు.. నగరంపాలెం రోడ్డులోని వాంబేకాలనీ కూడలి వద్ద అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. స్థానిక ఎస్ఐ వెంకటరావు తన సిబ్బందితో దాడి చేసి అవినాష్, కె. పూరిబాబు, రవి అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని సోదా చేయగా 4.8 కేజీల గంజాయి దొరగ్గా.. దానిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండుకు తరలించామని సీఐ తెలిపారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ


శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులతో అధికారులు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో మూడో రోజైన సోమవారం ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి 350 మంది క్యాడెట్లు పాల్గొనగా వారికి నావికాదళానికి సంబంధించి క్యాంప్ డ్రిల్, టెంట్ పిచ్చింగ్, ఆయుధాల వినియోగంపై అవగాహన, శరీర దారుఢ్య శిక్షణ, పలు సబ్జెక్టులపై శిక్షణ, బెండ్స్ వంటివి నిర్వహించారు. ఈ శిబిరంలో క్యాంప్ కమాండెంట్ కమాండర్ సీజీ ఇంగ్లేశ్వర్, ఎన్‌సీసీ అధికారి కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.